# సిపప్పు జిందాబాద్

పసుపులేటి మాధవరావు

"ఏరేయ్ పుల్లిగా, యాడకి అడావుడిగా బోతన్నావ్, సుందర్రా ఏంటికేనా?"

"ఆఁ ! ఆఁ ! ఎందుకో రమ్మన్నా డంటగా అందర్నీ? నువ్వు రేలేదా ఏంది?"

"వత్తన్నాలే పద... పద" అంటూ తన గుడిసెలోకి వెళ్ళాడు సుబ్బయ్య.

సుబ్బయ్య గుడిసెకి చుట్టుపక్కల రెండు వందల గుడిసెలు దాకా ఉంటాయి. అది ఒక చిన్న పట్టణంలోని అందమైన మురికివాడ. ఆ మురికివాడకి నాయకుడు సుందరరావు. రాత్రి ఎనిమిది గంటలకు ఆ గుడిసె వాసు లందర్నీ తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో సమావేశం కమ్మని కబురు పంపించాడు ఆ రోజు పొద్దున్నే సుందరరావు.

సుందరరావు ఇంటి ముందు లైటు వేస్తే ఆ ఖాళీ స్థలం అంతా చక్కగా కనిపిస్తుంది. ఒక వందమంది దాకా కూర్చోటానికి వీలుగా టార్పాలిన్ పట్టలు వేసి ఉన్నాయి ఆ స్థలంలో. మధ్యలో ఒక కుర్చీ, దాని ఎదురుగా ఒక స్టూలు, స్టూలుపైన కొన్ని కాగితాల కట్టలు ఉన్నాయి. ఎనిమిదిన్నర అయ్యేటప్పటికి ఒక్కొక్కళ్ళూ వచ్చి కూర్చుంటున్నారు. ఒక ఏభైమంది దాకా పోగయ్యారు.

"ఏంది, ఇంకా అంతా ఒచ్చినట్టులేరే?" అంటూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు సుందరరావు. మరో పది నిముషాల్లో ఇంకొంతమంది చేరారు.

"ఏదన్నా మిటింగు బెడితే ఎవడూ రాడు. కబుర్లు మాత్రం మా కది గావాల ఇది గావాల, అని సెపుతుంటారు" అంటూ మొదలెట్టాడు సుందరరావు.

"ఇదిగో సూడండయా, అందర్నీ ఎనిమిదింటికల్లా రమ్మని కబురు పెట్టానా? ఇంకా సగంమంది గోడా రాలేదు. ఇట్టయితే మన మెట్టా బాగుపడతాం సెప్పండి? సరే, రానోళ్ళని ఒదిలేద్దాం. ఒచ్చినోళ్ళకే నేను సాయం జేత్త. మిమ్మ ల్నందరిని ఇప్పు డెందుకు రమ్మన్నానంటే..." అని చెప్పబోయి ఆగి - "ఎవరన్నా సెప్పుకోండి సూద్దాం" అన్నాడు - గుప్పిడి మూసి నా గుప్పెట్లో ఏముందో చెప్పుకో చూద్దాం అని పిల్లలు అడిగినట్లు.

"ఏడిసినట్టుంది, సు వ్వెందుకు రమ్మంది మా కెట్టా తెలుత్తదిరా సన్నాసీ?" అని వినిపించీ వినిపించకుండా నెమ్మదిగా వ్యంగ్యంగా అన్నాడు పుల్లయ్య.

"ఆఁ ఆఁ ఏంటన్నావ్?" అడిగాడు సుందర్రావు.

"ఏం లేదు. మాకేం దెల్సు అన్నాను." మామూలుగా చెప్పాడు పుల్లయ్య.

"ఎలక్షన్లు దగ్గిర బడ్తన్నాయ్‌గా?" అన్నాడు



వెంకన్న వెటకారంగా.

"అదేరా. ఎంకన్నా నీతో ఒచ్చిన సిక్కు. నేనేం జేసినా ఎలక్షన్ల కోసమే ననుకుంటావ్. అక్కడే పొప్పులో కాలేత్తన్నావు" అని అంటూ, అటూ ఇటూ చూసి - "ఒరే రాముడూ, నువు సెప్పరా ను వ్వేవనుకుంటున్నావ్?" అన్నాడు సుందర్రావు.

"మన గూడేనికి ప్రెత్తేకంగా వల్లకాడు పెట్టమని సైర్మన్‌గారి నడిగేం గదా, అదేమన్నా శాంచనయిందేమో !" అన్నాడు రాముడు వ్యంగ్యంగా.

"ఛీ... ఛీ:. ఛీ... ఎదవ... ఎదవన్నర ఎదవ అన్నీ ఎదవ మాటలు దవ్వ నీ నోటెంట మంచి మాట రాదురా" అని - "సరే మీరు కనుక్కోలేరు గాని, నేనే సెవుతా ఇనండి. మిమ్మ ల్నందర్నీ ఎందుకు రమ్మన్నానంటే అందరికీ సి పప్పు లోన్లిప్పిచ్చటానికి. మీ యందరిచేత అప్లికేషన్లు పెట్టిచ్చమని సైర్మన్ అనంతయ్యగారే జెప్పారు" అని అమితానందంగా ప్రకటించాడు సుందరరావు.

"ఏందీ సి పొప్పా? ఇదేం పొప్పుబ్బా?" అన్నట్లు చూస్తున్నారు అందరూ.

"ఒరే ఎంకన్నా ఇప్పుడు నువు సెప్పరా 'సి పొప్పు' అంటే ఏందో - నువు కాత్తో కూత్తో సదువుకున్నావుగా !"

"ఏరుశనగ పొప్పుకి ఇంగ్లీసు పేరేమో ఇది" అన్నాడు బుర్ర గోక్కుంటూ.

"నీ మొకం, అంతమాత్రమేనా నీకు దెల్సింది?" అని అందరి వంకా చూసి "ఇంకెవరన్నా చెప్పండి చూద్దాం" అన్నాడు సుందరరావు.

"ఏమోనయ్యా కందిపప్పు, మినప్పొప్పు, శనగపొప్పంటే మాకు దెల్సు గాని ఇదేం పొప్పో మరి మాకు దెలియదు" అన్నా డింకో వ్యక్తి.

"ఒరే రాముడూ, ను వ్వే మనుకుంటన్నావో సెప్పరా?"

"ఆఁ ! గన్నేరు పొప్పయ్యుంటుందిలే" అన్నాడు రాముడు తేలికగా.

"ఛ... ఛ... ఛ... ని న్నడగటం నాదే బుద్ధి తక్కువరా !" చెవులు మూసుకుంటూ అన్నాడు సుందరరావు.

"అన లదేందో సెప్పక ఏందెహె ఈ బాగోతం." చిరాకు పడ్డాడు వెంకన్న.

"చెబుతా. చెబుతా. 'సి ప్పొప్పు' అంటే బాంకుల్లో అప్పు లియ్యటానికి గవర్మెంటు పెట్టిన ఒక పథకం అన్నమాట. దాని పెకారం పట్నాల్లో వుంటన్న పేదోళ్ళకి బాంకులు అప్పు లియ్యాలి. ఆ పథకం కింద మన గుడిసెలో ళ్ళందరికి అప్పిప్పిద్దామని అనంతయ్యగారు సెప్పారు. అందుకు రమ్మన్నాను మీ యందర్నీ" అన్నాడు నవ్వుతూ సుందరరావు.

"గవర్మెంటు పోగ్రాముంటే అనంతయ్యగారి ప్పిచ్చేదేంది?" అన్నాడు రాముడు.

"ఆఁ... అక్కడే పొప్పులో కాలేత్తన్నావు నువ్వు. గవర్మెంటు పోగ్రాం అయితే బెట్టింది గాని, అడ్డమైనో ళ్ళందరికీ అప్పియ్యమన్లా. చాలా తక్కువ మందికి మాత్రమే ఇత్తరన్న మాట."

"అప్పనేదీ మళ్ళీ తిరిగి కట్టాల్సిందేగా, మనకి పెద్దగా ఒరిగేదేందంట?" అన్నాడు వెంకన్న.

"ఇదుగో ఎంకన్నా బాంకుల్తో యవ్వారం నీకు తెలవదు. నీబోటోళ్ళ కిచ్చే అప్పులు మళ్ళీ తిరి గొత్తాయని ఆశతో ఇవ్వరు. ఆ డబ్బు లిక అంతే సంగతు లనుకొనే ఇత్తరు. కాకపోతే అప్పుడప్పుడు కట్టమని అడుగుతుంటారంతే. ఎప్పుడన్నా సేతులో ఉన్నప్పుడు పదో పరకో కడ్తే సరిపోద్ది. మననేం తలగొట్టి మెలైరు" అని సుందరరావు చెప్పేటప్పటికి అందరూ సంబరపడ్డారు. "ఇది భలే ఉంది", "భలే ఉంది" అనుకున్నారు.

"అంత బాగానే ఉంది గానీ, మనకి అప్పు గారంటీగా ఇత్తరని నమ్మకమేంది?" అడిగాడు మధ్యలో ఇంకో వ్యక్తి.

"ఇయ్యకపోట మేందయా? ఇయిగో అపిలికేషన్లు మీ యందరి చేత ఏలిముద్దర్లు, సంతకాలు పెట్టిచ్చుకు రమ్మన్నారు అనంతయ్యగారు. అనంతయ్యగారు చెప్పాట మేంది, అప్పియ్యకపోట మేంది?" అని అప్లికేషన్సు చూపించాడు సుందరరావు.

"అనంతయ్యగారికి 'జై' !" అని అరిచాడు మధ్యలోంచి ఒక వ్యక్తి. అందరూ "జై" అన్నారు.

తరువాత అందరిచేత వేలిముద్రలు వేయించాడు సుందరరావు. అప్లికేషన్లతో పాటు ఇంకొన్ని కాగితాలపైన కూడా వేలిముద్రలు వేయించి, వాళ్ళను పంపించాడు సుందరరావు.

తెల్లవారిన తరువాత ఈ విషయం తెలుసుకొని మిగిలిన వాళ్ళంతా వచ్చి, సుందరరావును కలుసుకొని వేలిముద్రలు వేసి వెళ్ళారు.

** ** **

ఉదయం పది గంటలకు జనసమూహంతో కోలాహలంగా ఉంది బాంకు. అందరూ సీపప్‌లోను అప్లికేషన్సు తీసుకోటానికి వచ్చినవాళ్ళు. అప్లికేషన్సు ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఒక కౌంటరు తెరిచారు. క్యూలో నిలబడి ఒక్కొక్కళ్ళు అప్లికేషన్సు తీసుకొని వెళ్ళిపోతున్నారు.

బాంకు మేనేజరు అనంతయ్యతో తన గదిలో కూర్చుని ఉన్నాడు. అనంతయ్య తెచ్చి ఇచ్చిన అప్లికేషన్సు జాగ్రత్తగా కట్టలు కట్టి బీరువాలో భద్రపరిచాడు.

"జనం బాగా వస్తున్నా రనుకుంటానండి అప్లికేషన్సు కోసం" అన్నాడు అనంతయ్య.

"చూస్తున్నారుగా? నాలుగు రోజుల్నించి అప్లికేషన్లు పంచటమే అయిపోతున్నది మా పని. చూడండి ఆ క్యూలో ఎంతమం దున్నారో ! ఇటువంటి స్కీములు పెట్టి జనాన్ని మామీదికి తోలుతున్నది గవర్నమెంటు. ఏం చెయ్యాలి చెప్పండి. పైగా పేపర్లలో పబ్లిసిటీ. ఇట్లా పేపర్లలో వెయ్యటం మూలంగా ప్రతివాడూ బాంకు కొచ్చి, అప్పియ్య మనేవాడే. ఒక్కొక్కడు వస్తుంటాడు - వాడికి అప్పు ఎందుకు కావా లనడిగితే వాడు చెప్పే సమాధానం ఘోరంగా ఉంటున్నది. ఉదాహరణకి ఆ క్యూలో ఉన్న వాళ్ళని నలుగుర్ని పిలిచి అడుగుతాను మీ ముందే. వాళ్ళు చెప్పే సమాధానం మీరే వినండి" అని బెల్ కొట్టి, ప్యూనును పిలిచి - "ఆ అప్లికేషన్సు తీసుకొని పొయ్యే వాళ్ళలో నలుగుర్ని పిలిచి లోపలికి పంపించు" అని చెప్పాడు.

ప్యూను అవతలికి వెళ్ళి ఒకతన్ని పంపించాడు.

"దండాలయ్యా" అంటూ వచ్చా డతను లోపలికి.

"నీ పేరేమిటి?" మేనేజరు.

"సుబ్బులండి."

"ఏం పని చేస్తున్నావ్?"


"కూలి పనండి."

"అప్పెందుకు నీకు?"

"మా అమ్మాయి పెద్దమడి సయిందండి. బంతి పెట్టాల గదండి."

అనంతయ్య వంక చూసి - "సరే వెళ్ళు" అన్నాడు మేనేజర్.

సుబ్బులు బయటికి వెళ్ళగానే రెండో వ్యక్తిని పంపించాడు ప్యూను.



"నీ పేరిమిటయ్యా?"

"అరిచ్చెంద్రుడండి."

"ఏం పని చేస్తావు?"

"తోలు దీస్తా, ఎముక లిరుస్తా" అన్నాడు గట్టిగా.

మేనేజరు కొంచెం కంగారుపడి, "ఇదేంటయ్యా బాబూ, ఏం పని చేస్తుంటావంటే తోలు తీస్తానంటావు !" అన్నాడు.

హరిశ్చంద్రుడు లెంప లేసుకుని - "అయ్యయ్యో తమర్ని గాదండి. నేన్జేసే పనండి అది. పొద్దున్నే యాటలకి తోల్దీస్తానండి. తరువాత కాళ్లో కెల్లి ఎముక లిరుస్తుంటానండి. నేన్జేసేది కసాయి పనండి."

"రక్షించావ." ని మనసులో అనుకొని - "సరే అప్పెందుకు నీకు?"

నిజం చెప్పాలంటే నేను సంపాదిచ్చేది నా పెద్ద పేమిలీవరకైతే సరిపోద్దండి. కాని యదవది నాకు సిన్నిల్లు ఒక టేడ్సిందండి. అంటే నాకు ఇద్దరు పెళ్ళాలన్న మాటండి. ఒక మంచి పట్టుచీర కొనమని మా చి న్నాడది ఎప్పుడ్నుంచో గోల సేత్తందండి. అందుకనీ..." అంటూ చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు హరిశ్చంద్రుడు.

"చూశారుగా, వీ ళ్ళందరికీ అప్పులు కావాలి" అన్నట్టు అనంతయ్య వంక చూసి - "సరే ను వ్వెళ్ళు" అన్నాడు మేనేజరు.

అతను వెళ్ళగానే మూడో వ్యక్తి లోపలి కొచ్చాడు.

"ఈ అప్పు తీసుకొని ఏం చేస్తావు నువ్వు?" అడిగాడు మేనేజరు.

"మరండీ మా పక్క వీథిలో ఇద్దరు కుర్రాళ్ళు తన్నుకున్నారండి..." అని చెప్పబోతూన్నా డతను.

అంతలో మేనేజరు అందుకొని - "ఏంటయా నువు చెప్పేది? నీ అప్పుకీ, మీ పక్క వీథిలో వాళ్ళు తన్నుకోటానికీ ఏమిటి సంబంధం?" అన్నాడు.

"అయ్య ! ఉందండి. అళ్ళు తన్నుకున్నోళ్ళు తన్నుకొని ఊరుకోలేదండి. ఒకడు కత్తి దీసి రెండో వోణ్ణి పొడిశాడండి. ఆ పొడిసినోడు మా యబ్బాయికి స్నేహితుడండి. అందుకని, అందుకని పోలీసులు మా యబ్బాయిని గోడ పట్టుకుపోయారండి. మరాడ్ని ఇడిపించాలంటే డబ్బు కావాలి గదండి."

"సరే ను వ్వెళ్ళు" అన్నాడు మేనేజరు.

అతను వెళ్ళగానే ఇంకో వ్యక్తిని పంపించాడు ప్యూను. చిరుగుల చొక్కా, చింపిరి జుట్టు, మాసిన గడ్డంతో వచ్చా డతను.

"నీ పేరేంటయ్యా?"

"కీశకుడండి. నేను చిన్నప్పుడు - అంటే అయిదేళ్ళప్పుడు మా పక్కింటి అమ్మాయిని బలాత్కారం సెయ్యిబోయ్యానంటండి. అప్పుడ్నుంచి నా పేరు కీశకు డన్నారంటండి. అసలు పేరేందో నాకూ దెలియదండీ."

"ను వ్వేం పన్జేస్తావ్?"

"మీ రిట్టా అడిగితే నా క్కొంచెం ఇబ్బందండి. యదవది నేనా ఏ పనైనా చేత్త గాని అబద్ధం మాత్రం చెప్పలేనండి."

"పోనీ నిజమే చెప్పు."



"అట్టన్నారు... కొడ్తానండి."

"ఇదేంటయ్యా, నిజం చెప్పమంటే కొడ్తానంటావ్?"

"క్షమించండి. తమర్ని కాదండీ. జేబులు కొడ్తానండి. అదండి నా పని."

"ఆహాఁ ! అయితే ఇప్పుడు మేం కళ్ళు మూసుకొని నిలబడాలా?"

"అబ్బెబ్బే. మీరు కళ్ళు మూసుకు నిలబడితే నా వన్తన మేముందండి. మీ వనిలో మీ రున్నప్పుడు నా పని నేను చేసుకోగల్నండి."

అనగానే అనంతయ్య చేతులూ, మేనేజరు చేతులూ అప్రయత్నంగా జేబులపైకి వెళ్ళాయి.

"సరేగాని, అప్పెందుకు నీకు?"

"స్టీలు కత్తెర్లు, ఇనప కత్తెర్లు ఊరికూరికినే ఇరిగిపోతన్నయ్యండి. నాలుగు ఎండి కత్తెర్లు కొంటే, జీవితాంతం పడుంటయ్యనండి. నాలుగు వారాల్లో మీ అప్పు మీకు తీర్చేత్తనండి" అని నమస్కారం చేశాడు కీచకుడు.

"సరే చూద్దాం. నీవు వెళ్ళొచ్చు" అని అనంతయ్య వంక చూశాడు మేనేజరు.

అనంతయ్య ఒక చిన్న నవ్వు నవ్వి - "నా కవతల అర్జెంటు పనుంది నే వస్తానండి. అప్లికేషన్స్ అన్నీ మీకు కావల్సిన విధంగా పూర్తి చేయించాను" అని లేచాడు అనంతయ్య.

"రైట్. నేను చూసి ఇంకేమన్నా అవసరమైతే చెప్తాను లెండి" అన్నాడు మేనేజరు.

అనంతయ్య బయటికి నడిచాడు.

మేనేజరు లేచి బీరువాలో ఏదో ఫైలుకోసం వెతుకుతున్నాడు, అంతలో - "హల్లో మూర్తీ ! హౌ ఆర్ యూ?" అంటూ లోనికి ప్రవేశించాడు బెంగుళూరు నుంచి వచ్చిన అతని మిత్రుడు సుదర్శన్.

మేనేజరు వెనక్కు తిరిగి - "హల్లో సుదర్శన్, వాట్ ఎ సర్‌ప్రైజ్ !" అంటూ సంతోషంగా మిత్రుడి దగ్గర కొచ్చి కరచాలనం చేసి కూర్చోమని కుర్చీ చూపించాడు.

సుదర్శనం మూర్తి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమిటీ, ఉత్తరం పత్తరం లేకుండా హఠాత్తుగా ఊడిపడ్డావ్?" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"ఆఫీసు పనిమీద సడెన్‌గా బయలుదేరాల్సి వచ్చింది. అందుకే నీకు ముందుగా తెలియజేయలేకపోయాను. అవునూ, ఏమిటీ బాంకంతా చాలా సందడిగా ఉన్నట్లుంది !" అన్నాడు.

"సీపప్ అని ఓ కొత్త స్కీము పెట్టారు అప్పు లివ్వటానికి. అదే పెద్ద హెడేక్ అయింది మాకు."

"అంటే సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రాం ఫర్ అర్బన్ పూర్ అని ఆమధ్య పేపర్లో చదివాను. అదేనా?"

"ఆఁ ! అదే... అదే."

"ఇది పట్టణాల్లో నివసించే పేదలకే పరిమితం కదా?"

"స్కీము పేరులోనే ఉంది కదయ్ అది."

## జల దుర్గాలు

విమానాలు, బాంబుల వంటివి యుద్ధరంగంలో ప్రవేశించకముందు, ఫిరంగులు, తుపాకులు, బాణాలు వంటి వాటితోనే కోటల్ని ముట్టడిస్తుండేవారు. సైనికులు కోట గోడలమీద బురుజులలో నిలబడి శత్రువులమీద బాణాలు, తుపాకీ గుళ్ళు వదులుతుండేవారు. మరి యుద్ధాలు నీటిమీద కూడా జరిగేవి కదా ! అందుకోసం కొన్ని పాశ్చాత్య దేశాలు 13-18 శతాబ్దాల మధ్య కాలంలో, కోటల ఆకారంలో యుద్ధ నౌకలను నిర్మించుకునేవి. వీటికి ముందూ వెనుకా బురుజులు ఉండేవి. వాటిపైన గస్తీ సైనికులు కావలా కాసేవారు. అక్కడనుంచే శత్రు నౌకలను ఎదుర్కొనేవారు. ఈ నౌకల్ని చూస్తే నీటిమీద తేలే కోటలలాగా అనిపించేవి. ఈ, జల దుర్గాలను 'ఫాసిల్' అనేవారు. -కె. ఆర్. కె. మోహన్

"కరక్టే. అయితే పట్టణాల్లో ఉండే పేద లందరికీ అప్పు ఇస్తారా దీనిద్వారా?"

"ఆఁ ! అందరికీ ఎక్కడ ఇవ్వగలం? గవర్నమెంటు సూచనల ప్రకారం ప్రతి పట్టణంలోనూ, నగరంలోనూ ఉన్న జనాభాలో ప్రతి మూడు వందల మందిలో ఒక్కరికి లోను ఇవ్వటం జరుగుతూంది. అంటే మా పట్టణ జనాభా ఒక లక్షా ఇరవై వే లనుకుంటే నాలుగు వందల మందికి అప్పు దొరుకుతుంది. ఒక్కొక్కరికీ అయిదు వేలవరకు అప్పు ఇవ్వవచ్చు."

"బాంకులు సహజంగా ఏదో సెక్యూరిటీ లేనిదే అప్పు ఇవ్వవు గదా ! మరి పేద వాళ్ళ దగ్గి రేముంటుంది మీకు సెక్యూరిటీ ఇవ్వటానికి?"

"ఈ పథకం కింద సెక్యూరిటీ ఏమీ అక్కరలేదు. అప్పు తీసుకున్న డబ్బుతో వాళ్ళు కొనే వస్తువులే సెక్యూరిటీ అన్నమాట."

"ఏ ఏ పనులకి అప్పు ఇస్తారు ఈ ప్రోగ్రాం ద్వారా?"

"అది చాలా పెద్ద లిస్టులే. రిక్షాపుల్లర్సు, కార్పెంటర్లు, కుమ్మరులు, కూరగాయలు అమ్ముకునే వాళ్ళు, పాలమ్మే వాళ్ళు, వగైరా... వగైరా..."

"అంటే ఇది చాలా మంచి ప్రోగ్రాం, అన్నమాట."

"ఏం మంచి లేదూ?"

"అదేమిటి మూర్తీ ! అలా అంటావు? ఏ ఆధారం లేని నిరుపేదలకు ఋణ సహాయం అంటే మాటలా? నాకు తెలుసు వాళ్ళకు ఒక్క వంద రూపాయలు అప్పు పుట్టాలంటే ఎంత కష్టమో ! ఒకవేళ అప్పు పుట్టినా వాళ్ళు నూటికి నెలకు పది నుంచి పదిహేను రూపాయల దాకా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అటువంటి వాళ్ళకు ఇంత డబ్బు అప్పుగా స్వల్ప వడ్డీకి లభించడం అంటే నిజంగా పండగే. పైగా ఈ స్కీములకు పాతిక శాతం సబ్సిడీ కూడా ఉంటుంది కదా. మంచివాళ్ళను చూసి ఇలాంటి సహాయం చేస్తే నిజంగా దేశం బాగుపడుతుంది."

"నీకు తెలియదులే సుదర్శన్ ఇవన్నీ ప్రజల్ని ఉద్ధరించటానికి పెట్టినవి కావు. ఆల్ దీజ్ ఆర్ వోట్ కాచింగ్ డివైజెస్ ఆఫ్ ది గవర్నమెంట్."

"నో ! నో ! మూర్తీ, నువ్వు పొరపడుతున్నావ్. గవర్నమెంటు ఉద్దేశం ఏదైనా, ఇవి సక్రమంగా అమలుజరిగితే సత్ఫలితాలు తప్పకుండా వస్తాయి."

"వీటిని సక్రమంగా ఇంప్లిమెంట్ చెయ్యటం చాలా కష్టం సుదర్శన్. ఇందులో రకరకాల రాజకీయ వత్తిడు లుంటాయి. అవన్నీ తట్టుకొని నిలబడాలంటే సామాన్యం కాదు."

"అది కాదు మూర్తీ..." అని ఏదో మాట్లాడబోయాడు సుదర్శన్.

"లీవ్ దట్ సుదర్శన్. చాలా కాలానికి కలిశాం. మన టైముని ఈ విధంగా వేస్టు చెయ్యటం నా కిష్టం లేదు" అంటూ డిస్కషన్‌ని కట్ చేశాడు మూర్తి.

తరువాత కాసేపు కుటుంబ విషయాలు మాట్లాడుకుని వెళ్ళిపోయాడు సుదర్శన్.

** ** **

కాగితాల మీద సంతకాలు, వేలిముద్రలు పెట్టించుకొని చాలా రోజులైంది కదా, ఇంకా డబ్బు లెప్పు డొస్తాయని మురికివాడ జనమంతా వచ్చి సుందరరావుని అడిగి పోతున్నారు.

"వస్తాయ్, వస్తాయ్. బాంకుల్తో పని గదా ! ఆలస్య మవుతుం"దని చెప్తూ వస్తున్నాడు సుందరరావు. కొన్ని రోజులు అడిగి అడిగి విసుగుపుట్టి అడగటం కూడా మానేశారు వాళ్ళంతా.

** ** **

ఆరు నెలలు గడిచిపోయాయి. మేనేజరు మూర్తి స్థానంలో కొత్త మేనేజరు వచ్చాడు.

"తాత నీ కేదో బాంకు నుంచి కవ రొచ్చిందే !" అంటూ కవరు రంగయ్య కిచ్చాడు పోస్టుమేన్.

"బాంకు నించా? నాకా? ఏం దబ్బా?" అనుకుంటూ - "అయ్యా నాకు సదువు రాదుగా. అదేందో కాత్త సదివిపెట్టు" అని అడిగేడు పోస్టుమేన్‌ని.

పోస్టుమేన్ కవరు విప్పి చదివి - "తాత ! నువ్వు బాంకులో నాలుగు వేలు అప్పు తీసుకున్నావంట. అర్నెల్లైనా పైసా కట్టలేదు. వెంటనే డబ్బులు తిరిగి కట్టమని నోటీ సిచ్చారే" అని ఆ ఉత్తరం రంగయ్య చేతిలో పెట్టాడు.

"ఏందిది, బాంకు నాకు అప్పిచ్చిందా? నాలుగు వేలా? ఆరు నెల్ల కిందటా? ఎంత అన్నాయం ! ఆ సుందర్రావుగాడు ఏలిముద్రలు తీసుకున్నాడు గాని, డబ్బు లెక్కడ ప్పిచ్చాడు? ఆడి చుట్టూ తిరిగి తిరిగి ఇసుకొచ్చి ఊరుకున్నా గదా !" అంటూ ఆ ఉత్తరం తీసుకొని వెళ్ళాడు రంగయ్య.

ఆ గూడెంలో అందరికీ అదే విధంగా నోటీసు లందాయి. లబో దిబో మన్నారు అందరూ.

** ** **

నెల రోజుల క్రితం సుందరరావు తన పెంకుటింటి స్థానంలో వెలసిన డాబాలోకి "సీపప్ జిందాబాద్ !" అనుకుంటూ గృహప్రవేశం చేశాడు.

మేనేజరు తన ఇద్దరి కూతుళ్ళకూ ఘనంగా వివాహాలు జరిపించాడు.

అనంతయ్య మరో లారీ కొన్నాడు. ★